సమస్యల పరిష్కారానికి చర్యలు

- డివిజన్‌స్థాయి స్పందనలో సబ్‌కలెక్టర్ కార్తీక్


రొద్దంలో వినతులు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ కార్తీక్

రొద్దం: స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి సమస్యలు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్తీక్ అన్నారు. మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో సోమవారం డివిజన్‌స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ కార్తీక్‌తో కలసి తహసీల్దార్ అనంతచారి, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకూ సబ్‌కలెక్టర్ స్పందన కార్యక్రమం నిర్వహించారు.

వివిధ సమస్యలపై 52 వినతులు

భూ సమస్యలు, రహదారి, రేషన్ కార్డులు, పింఛన్లపై తదితర వాటిపై ప్రజల నుంచి 52 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ స్పందనలో తమకు అందిన వినతులపై ఆయా శాఖల అధికారులు మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఏ మండలానికి సంబంధించిన సమస్యలపై ఆ మండల అధికారులతో మాట్లాడతామన్నారు. రొద్దం మండలంలో రేషన్‌కార్డులు, ఇళ్ల పట్టాలు, రహదారికి సంబంధించిన 35 వినతులు వచ్చాయి. అందులో ఇళ్ల స్థలాలు, భూ సమస్యలు, రహదారి సమస్యలపై వినతులు వచ్చాయి. మండల కేంద్రంలో తాగునీటి శుద్ధ జలం కేంద్రం పునరుద్ధరించాలని, అలాగే డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని, రొద్దం చిన్నచెరువు మరువకు మరమ్మతులు చేయాలని బీజేపీ నాయకులు సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అమరాపురం మండలానికి సంబంధించిన 11 వినతులు అందాయి. ఇళ్ల స్థలం, ఇంటి మంజూరు కోసం వినతులు వచ్చానట్లు అధికారులు తెలిపారు. అలాగే పెనుకొండకు సంబంధించి మూడు వినతులు, హిందూపురం మండలానికి సంబంధించి మూడు వినతులు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, అన్ని శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

రొద్దం: మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే శంకర నారాయణ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభవుతుందన్నారు.

నాణ్యమైన విద్యను బోధించండి

- జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్


పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న జడ్జి అశోక్‌కుమార్

మడకశిర: పట్టణంలోని జ్యోతిరావుపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలను సోమవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ అశోక్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. అంతేకాకుండా ఉపాధ్యాయులకు కూడా ఆయన సలహాలు, సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

సోమందేపల్లి: మండలంలోని సుద్దగుంటపల్లిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అంజినప్ప, ఆదిలక్ష్మమ్మ దంపతులు సోమవారం పొలం పనులకు వెళ్లారు. అయితే మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి పొగలు వస్తున్న విషయాన్ని స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లోని వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయని, రూ.3 లక్షలు ఆస్తి నష్టం వచ్చిందని బాధితులు వాపోయారు.

ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి

- ఎమ్మెల్యే తిప్పేస్వామి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: డీలర్లు వినియోగదారులకు నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి సూచించారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో మడకశిర మున్సిపాలిటీ, మడకశిర రూరల్ పరిధిలోని డీలర్లతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సమావేశంలో డీలర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీలర్లు కొంతమంది ఎండీయూ ఆపరేటర్లపై ఫిర్యాదు చేశారు. ఎండీయూ ఆపరేటర్లు సక్రమంగా పని చేయడంలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వారివల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందన్నారు. ఎండీయూ ఆపరేటర్లు సక్రమంగా పని చేసే విధంగా చూస్తానని డీలర్లకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డీలర్లు వినియోగదారుల ప్రేమాభిమానాలను చూరగొనాలన్నారు. డీలర్ల నుంచి ప్రభుత్వానికి మంచి పేరు రావాలని సూచించారు. డీలర్ల సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ రామిరెడ్డి, ఎంపీపీ కవిత, మాజీ ఎంపీపీ బజ్జప్ప, డీలర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జగన్నాథ్‌రెడ్డి, పరమేశ్, స్థానిక నాయకులు జయరాజ్, తిమ్మప్ప, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పురం'లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం


లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్: 'జగనన్న సురక్ష' కార్యక్రమాల్లో నేరుగా పాల్గొంటుండటంతో ఆయా గ్రామాల సమస్యలు వెలుగులోకి రావడమే కాకుండా అక్కడికక్కడే పరిష్కరించేందుకు వీలు కలుగుతోందని వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి , దివంగత వైఎస్సార్‌సీపీ నేత రామకృష్ణారెడ్డి సతీమణి జ్యోత్స్న తెలిపారు. సోమవారం చౌళూరులో సర్పంచ్ నంజప్ప అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. మిగతా ప్రాంతాల్లోని సమస్యలను కూడా గుర్తించి వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తున్నామన్నారు. 2024 ఎన్నికల్లో హిందూపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. తర్వాత అంగన్వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీపీ రత్నమ్మ, వైస్ ఎంపీపీ రామాంజి, ఎంపీటీసీ కృష్ణవేణి, జడ్పీటీసీ నాగభూషణం, నాయకులు రంగనాథ్, శ్రీనివాసరెడ్డి, సుధాకరరెడ్డి, రామకృష్ణారెడ్డి, తిమ్మారెడ్డి, మల్లేష్, గంగాధర్ ఎపీఎం రామకృష్ణ, డాక్టర్ ఆదిశేషు, రెహమాన్, మజాద్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై శాంతిర్యాలీ


అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెనుకొండ: మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని పట్టణానికి చెందిన మానవహక్కులు, ఎమ్మార్పీఎస్, విక్టిమ్స్ ఆఫ్ వాయిస్, సీపీఐ నాయకులు సోమవారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతినెలకొల్పాలని, మానవ హక్కులను కాపాడాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మణిపూర్ ఘటనలతో దేశంలో శాంతి భద్రతల సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం సత్వరమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ఇంతటి దారుణం జరుగుతోందంటే దేశ ఉనికికే ప్రమాదం అన్న విషయాన్ని కేంద్రం గుర్తించాలన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. మానవ హక్కుల జిల్లా నాయకులు రవూఫ్, యంగ్ ఇండియా వెంకటేశులు, హైకోర్టు అడ్వకేట్ రామకృష్ణ, మాలమహానాడు కన్వీనర్ ఎంఎస్.మూర్తి, దండోరా రామాంజి, నరసింహులు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలను మభ్యపెట్టడానికే టీడీపీ రథయాత్ర'

మడకశిరరూరల్: ప్రజలను మభ్య పెట్టడానికే టీడీపీ నాయకులు మహాశక్తి చైతన్య రథయాత్ర నిర్వహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. సోమవారం గౌడనహళ్లి పంచాయతీలో రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి నాయకులతో కలిసి రథయాత్ర నిర్వహించారు. అయితే రథయాత్రలో టీడీపీ అధికారంలో ప్రజలకు చేసిందేమీ లేకపోవడంతో, తప్పుడు హామీలతో మరోసారి మోసపూరిత హామీలు, ప్రచారాలు చేస్తున్నారని రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజుగౌడు, మండల బీసీ సెల్ నాయకులు హెచ్‌ఆర్ పాళ్యం సత్యనారాయణ, హనుమంతరాయప్ప ఒక ప్రకటనలో తెలిపారు. 2014 ఎన్నికల్లో 600కు పైగా హామీలు ఇచ్చి సీఎం అయ్యాక చంద్రబాబు మేనిఫెస్టోను మాయం చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. వైఎస్ జగన్ ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 99 శాతం అమలు చేశారని స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తుండటాన్ని జీర్ణించుకోలేకనే టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అసత్య ప్రచారాన్ని చేస్తున్నారని తెలిపారు.

తుంగభద్ర జలాలు తరలించండి


ఏఈఈకి వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

పావగడ: తుంగభద్ర జలాలను పావగడకు తరలించి సాగు, తాగు నీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక కిసాన్ రైతు సంఘం రాజ్య అధ్యక్షుడు నాగభూషణరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక జెడ్పీ కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడుతూ తుంగభద్ర నీటిని 36 నెలల్లోపు అందించాలనే కోర్టు ఆదేశాలుండగా సంవత్సరాలు గడుస్తున్నా నీటిని వదలడం జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. మూడు నెలల్లోగా తుంగభద్ర నీటిని పావగడకు తరలించకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో స్థానిక కిసాన్ రైతు సంఘం యువ విభాగం మహిళా అధ్యక్షురాలు అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు. జలవనరుల శాఖ ఏఈఈ హనుమంతరాయప్పకు వినతిపత్రం అందించారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

హిందూపురం టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలంటూ పవర్ జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సోమవారం స్థానిక వీడీ రోడ్డులోని పవర్ హౌస్ నుంచి విద్యుత్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీగా గాంధీ సర్కిల్ చేరుకుని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు.

వ్యవసాయ పనుల్లో అన్నదాత


పి.సడ్లపల్లిలో విత్తనాలు విత్తుకుంటున్న రైతు

లేపాక్షి: ఇటీవల కురిసిన వర్షాలతో లేపాక్షి మండలంలోని రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు అందించడంతో పంటలు పెట్టుకోవడానికి రైతులు ముందుకు వస్తున్నారు. ముఖ్యంగా రాగి పంటకు అధికంగా రాయితీ ఇవ్వడంతో రాగి పంట వేసేందుకు మక్కువ చూపుతున్నారు. వర్షాలు రాకమునుపు 700 హెక్టారుల్లో మొక్కజొన్న, 200 హెక్టారుల్లో వేరుశనగ విత్తనం విత్తుకున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు మరింత మంది రైతులు వేరుశనగ, మొక్కజొన్న విత్తనాలను విత్తుకుంటున్నారని చెప్పారు.

బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి కృషి

హిందూపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవ సంఘ సమైక్య జిల్లా అధ్యక్షుడు, కమిటీ సభ్యులు సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డిని స్థానిక పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల నూతనంగా ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవ సంఘ సమైక్య నూతన కమిటీ ఎంపిక జరిగింది. ఈ నేపథ్యంలో వారు వేణురెడ్డిని కలిశారు. బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని వేణురెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం సమైక్య జిల్లా అధ్యక్షుడు దేశాయి మురళి, ఉపాధ్యక్షుడు దేమకేతేపల్లి రామ్మూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ ప్రసాద్ రావు, కొటిపి నాగేశ్వరరావు, సతీష్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, నక్కలపల్లి శ్రీరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభం


తూమకుంటలో ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్ రత్నమ్మ

హిందూపురం అర్బన్: ప్రజల వద్దకే వైద్యం తీసుకురావాలన్న లక్ష్యంతో వైఎస్ఆర్ ప్రభుత్వం గ్రామీణ క్లినిక్‌లను తీసుకొచ్చిందని తూమకుంట సర్పంచ్ రత్నమ్మ పేర్కొన్నారు. సోమవారం ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. గ్రామస్తులు ఇక్కడ ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మమ్మ, నరసింహప్ప, మూర్తి, చక్కీరప్ప, ఎంఎల్‌ఓ శిరీషా, కార్యదర్శి కెంచ రాయప్ప, ఆశా వర్కలు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

పెనుకొండ రూరల్: మండలంలోని అమ్మవారిపల్లిలో ఆదివారం సాయంత్రం పీర్ల ఊరేగింపు సందర్భంగా ఘర్షణ జరిగినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే హరిజన అంజినప్పను అదే గ్రామానికి చెందిన హనుమంత రెడ్డి, వెంకటరెడ్డి కులం పేరుతో దూషించి దాడి చేసినట్లు బాధితుని భార్య నారాయణమ్మ ఫిర్యాదు చేశారన్నారు. గాయపడిన అంజినప్పను చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారన్నారు. 324, 355 రెడ్ విత్ 34, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

మండల విద్యాధికారికి సన్మానం


సత్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

అమరాపురం: మండల విద్యాధికారిగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల బదిలీపై అనంతపురం జిల్లా పామిడి మండల మండల విద్యాధిశాఖాధికారి- 2గా వెళ్లిన సత్యనారాయణ దంపతులను సోమవారం ఉపాధ్యాయులు సన్మానించారు. ఐదేళ్లుగా మండల విద్యాధికారిగా పనిచేసిన సత్యనారాయణ మండలంలో విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని వక్తలు కొనియాడారు. ఎంఈఓ సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు తనకు ఎంతో సహకరించారని, అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెనుకొండ: పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో సోమవారం మునిమడుగు గ్రామానికి చెందిన బోయ నాగభూషణం అనే వ్యక్తి క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల వివరాలమేరకు... పెనుకొండ పట్టణంలో రామన్న దంపతులకు స్థలం ఉంది. ఈ నేపథ్యంలో భూమిని తన పేరున రాయించి ఇవ్వాలని నాగభూషణం ఒత్తిడి చేశాడు. కుమారుడి మాట ప్రకారమే స్థలం రాసి ఇచ్చేందుకు తల్లిదండ్రులు పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు వచ్చారు. అయితే రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపు విషయంలో గొడవ పడిన బాధితుడు, తల్లిదండ్రులకు స్థానికులు సర్దిచెప్పారు. అయితే సహనం కోల్పోయిన నాగభూషణం క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అక్కడున్న వారు అడ్డుకొని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనమేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రస్తా సమస్య పరిష్కారం

గోరంట్ల: స్థానిక బూడిదదిన్న ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా ఇళ్లు నిర్మించడంతో దాదాపు వంద ఇండ్లకు రస్తా సమస్య ఏర్పడింది. ఈ నేపథ్యంలో కొంత కాలం నుంచి బూడిదదిన్న ప్రాంతములో నివాసం ఉంటున్న వారు సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ రంగనాయకులును కోరారు. సోమవారం ఆ ప్రాంతానికి చెందిన వారు స్పందన కార్యక్రమంలో తహసీల్దార్‌కు మరోసారి వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ రోడ్డుకు అడ్డంగా ఇళ్లు నిర్మించిన వారితో చర్చించారు. వారికి ప్రభుత్వ స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేయిస్తామని హామీ ఇవ్వడంతో సమస్య పరిష్కారమైంది. దీంతో బూడిద దిన్న వాసులు తహసీల్దార్ రంగనాయకులుకు కృతజ్ఞతలు తెలిపారు.

పకడ్బందీగా ఓటరు సర్వే

అగళి: మండల కేంద్రంలో 153వ బూత్‌లో కొత్త ఓటరు నమోదుతో పాటు రీ వెరిఫికేషన్‌ను పకడ్బందీగా చేస్తున్నట్లు తహసీల్దార్ జమానుల్లా ఖాన్ తెలిపారు. ఓటరు కార్డులో తప్పులను సరి చేసుకోవడంతో పాటు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ చంద్రకుమార్, సర్వేయర్ కార్తీక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ నమోదుపై శిక్షణ

రొళ్ల: స్థానిక రైతు భరోసా కేంద్రం ఆవరణలో సోమవారం ఈ-క్రాప్ బుకింగ్ నమోదుపై వీఆర్వోలు, వీఏఏలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఏఓ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ వీఆర్వోలు, వీఏఏలు గ్రామాల్లో పర్యటించి పంట నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ మంజునాథ్, వీఆర్వోలు, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

విన్సెంట్ ఫెర్రర్ క్రికెట్ టోర్నీ విజేత 'రీనౌన్డ్'


ట్రోఫీతో రీనౌన్డ్ పాఠశాల క్రికెట్ జట్టు

హిందూపురం టౌన్: ఆర్డీటీ ఆధ్వర్యంలో హిందూపురం క్రికెట్ అసోసియేషన్ సహకారంతో నాలుగు రోజులు స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో నిర్వహించిన ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ క్రికెట్ టోర్నీ విజేతగా పట్టణంలోని రీనౌన్డ్ పాఠశాల నిలిచింది. పట్టణంలోని 12 పాఠశాలలకు చెందిన జట్లు ఈ టోర్నీలో పాల్గొన్నాయి. సోమవారం చిన్మయా విద్యాలయ, రీనౌన్డ్ పాఠశాల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. చిన్మయ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 75 పరుగులు చేయగా రీనౌన్డ్ పాఠశాల జట్టు 9.1 ఓవర్లలో లక్ష్యం ఛేదించి చాంపియన్‌గా నిలిచింది. కర్ణాటక ప్రీమియం లీగ్ ప్లేయర్లు వెంకీ సచిన్, రాఘవేంద్ర విజయం సాధించిన జట్టును, క్రీడాకారులను అభినందించి ట్రోఫీని అందజేశారు.

నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయండి

అమరాపురం: మండలంలోని డీలర్లు నిత్యావసర సరుకులను ప్రజలకు సక్రమంగా అందించాలని తహసీల్దార్ రమేష్‌బాబు సూచించారు. సోమవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎండీయూ ఆపరేటర్లు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి సరుకులు పంపిణీ చేయాలని తెలిపారు. కొందరు డీలర్లు ఇంటి వద్ద సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే అలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది, డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

కల్తీ కల్లు అమ్మకాలపై చర్యలు తీసుకోండి

సోమందేపల్లి: మండలంలో కల్తీకల్లు అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని సోమవారం స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. కల్లు సేవించి చాలా మంది అనారోగ్యం బారిన పడుతున్నారని, ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాలస్వామి, నాయకులు చాంద్‌బాషా, ఆంజనేయులు, అంకన్న తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220723, 9705346587
9010200238, 9912220726

క్లుప్తంగా

శాలివాహన కమిటీ సభ్యుడిగా నాగరాజు


ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణను కలిసిన నాగరాజు తదితరులు

పరిగి: జిల్లా శాలివాహన, కుమ్మరి సంక్షేమ కమిటీ అధికారేతర సభ్యుడిగా పరిగి మండలంలోని శీగిపల్లికి చెందిన నాగరాజును ఎంపిక చేశారు. ఆదివారం జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారన్నారు. కుమ్మరుల సంక్షేమాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నాగరాజు తెలిపారు. ఇందులో భాగంగానే నాగరాజు సోమవారం ఎమ్మెల్యే శంకరనారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి


ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఈ

రొద్దం: మండల కేంద్రంలోని వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ డీఈ శివకుమార్‌నాయక్ సోమవారం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. అదేవిధంగా తురకలాపట్నం జగనన్న లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఖాజామైనుద్దీన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సోని, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్స్‌తో ప్రయాణికుడి మృతి


మృతుడు దాసప్ప

గుడిబండ: మండల పరిధిలోని సింగేపల్లి గ్రామానికి చెందిన దాసప్ప (74) ఫిట్స్ రావడంతో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మృతుడు సింగేపల్లి నుంచి గుడిబండకు సోమవారం ఉదయం 10 గంటల సమయంలో ఆర్టీసీ బస్సులో వెళుతుండగా ఫిట్స్ వచ్చాయి. ప్రయాణికులు అతని చేతికి ఇనుము అందించారు. కొద్దిగా తగ్గినప్పటికి గుడిబండలో బస్సు దిగే సమయంలో మళ్లీ ఫిట్స్ వచ్చాయి. కిందకు దించగా వెంటనే దాసప్ప మరణించినట్లు ఏఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. కుమారుడు శివలింగప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పెనుకొండ: న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలని పెనుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, సీనియర్ న్యాయవాది నాగార్జున తదితరులు న్యాయమూర్తి శంకరరావుకు వినతిపత్రం అందించారు. విజయవాడలో న్యాయవాది ఆదిశేషు విటల్‌బాబును దుండగులు హత్య చేయడాన్ని ఖండిస్తూ సోమవారం న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం న్యాయమూర్తికి వినతి పత్రం అందించారు. పలువురు జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం వాయిదా

హిందూపురం: హిందూపురం పురపాలక సంఘం సమావేశ మందిరంలో సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే కౌన్సిల్ మీట్‌కు ఎక్కువ మంది కౌన్సిలర్లు హాజరుకాకపోవడంతో సమావేశం వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ప్రకటించారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ


విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న దృశ్యం

హిందూపురం: విజయవాడలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో స్థానిక సిప్ అబాకస్‌కు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు అబాకస్ నిర్వాహకురాలు మాలతి తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగిన వివిధ పోటీల్లో రేవంత్ సాయి, తనూషానాగ్, ధ్రువిత్ చాంపియన్లుగా నిలవగా 22 మందికి మొదటి, రెండవ, మూడవ బహుమతులు దక్కాయన్నారు. మరో 22 మందికి పురస్కారాలు దక్కినట్లు చెప్పారు. ప్రతిభ కనబరిచిన వారికి సిప్ అబాకస్ రాష్ట్ర అధ్యక్షుడు గోపాలకృష్ణ, జయశంకర్‌లు బహుమతులను ప్రదానం చేసినట్లు చెప్పారు.